## తూర్పులో 66.74శాతం పోలింగ్

- 2018లో 72.86 శాతం నమోదు
- ఓటు వేసిన 2,54,641 మంది
- గతంలో కంటే తగ్గిన ఓటింగ్

వరంగల్, డిసెంబర్ 1 : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలింగ్ శాతం తగ్గింది. 2018 డిసెంబర్ అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఈసారి తగ్గింది. గత ఎన్నికల్లో 72.86 శాతం నమోదైంది. ప్రస్తుతం 66.74 శాతం మాత్రమే నమోదైంది. గత ఎన్నికల్లో కంటే ఓటర్లు పెరగడంతో పోలింగ్ స్టేషన్లు పెంచారు. 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో 2,11,750 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుత ఎన్నికల్లో 2,54,641 మంది ఉన్నారు. ఈసారి 42,891 మంది ఓటర్లు పెరిగారు. గతంలో 213 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం 230 ఏర్పాటు చేశారు. స్వీప్ ప్రోగ్రాంల ద్వారా ఓటర్లను చైతన్యం చేశారు. ప్రజలను మెప్మా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అయినప్పటికీ గత ఎన్నికల కంటే ఓటింగ్ శాతం తగ్గింది. పోలింగ్ సమయం ముగిసే వరకు పోలింగ్ స్టేషన్‌లలో భారీగా ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ ప్రక్రియ రాత్రి 8గంటల వరకు జరిగింది. రాత్రి 11 గంటలకు ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరాయి. 5గంటల వరకు 64 శాతం నమోదు కావడంతో బారులు తీరిన ఓటర్లు చూసి 74 శాతంగా ప్రకటించారు. అధికారుల అంచనాలు తప్పి 66.74శాతం పోలింగ్ జరిగినట్లు శుక్రవారం ప్రకటించారు. 2018 ఎన్నికల్లో 72.86శాతం ఓటింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో 66.74శాతం జరిగింది. 2,54,641 మంది ఓటర్లకు 1,70,274 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. 86,472 మంది మహిళలు ఓటు వేయగా, పురుషులు 83,742 మంది ఓటు వేశారు. ట్రాన్స్‌జెండర్ ఓటర్లు రాష్ట్రంలోనే అత్యధికంగా 338 మంది ఈ నియోజకవర్గంలో ఉండగా అందులో 60మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడి నుంచి ట్రాన్స్‌జెండర్ బరిలో ఉన్నప్పటికీ చాలా మంది ఓటు వినియోగించుకోలేదు. ఓటింగ్ పెంచాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల చైతన్య ప్రచారానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ అంబాసిడర్‌గా ఉన్న ట్రాన్స్‌జెండర్ల రాష్ట్ర అధ్యక్షురాలు లైలా తూర్పు నియోజకవర్గం ఓటరు కావడం గమనార్హం.

## ప్రభుత్వ పనివేళల్లో ప్రైవేట్ ప్రాక్టీస్ నిషేధం

వరంగల్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ దవాఖానల్లో పనిచేసే వైద్యులు పనివేళల్లో ప్రైవేట్ ప్రాక్టీస్ చేయరాదని కాళోజీ హెల్త్ వర్సిటీ అధికారులు సూచించారు. నేషనల్ మెడికల్ కమిషన్‌తోపాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ వైద్యులు ప్రభుత్వ పనివేళలైన ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రైవేట్ ప్రాక్టీస్ చేయొద్దని తెలిపారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

## సొసైటీ డైరెక్టర్‌కు 'పెద్ది' పరామర్శ


సొసైటీ డైరెక్టర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్ది

ఖానాపురం, డిసెంబర్ 1: ఖానాపురం సొసైటీ డైరెక్టర్ వేములపల్లి సునిత ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు గ్రామ కన్వీనర్ వేజళ్ల కిషన్‌రావు, సొసైటీ వైస్ చైర్మన్ వేణుక్రిష్ణ, వేముల వెంకటేశ్వర్‌రావు, ప్రసాద్ ఉన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం


రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న పాఠశాల చైర్మన్ నరేందర్

నర్సంపేట, డిసెంబర్ 1: రక్తదానం మరొకరికి ప్రాణదానమని డఫోడిల్స్ పాఠశాల చైర్మన్ చింతల నరేందర్ అన్నారు. శుక్రవారం పట్టణ డఫోడిల్స్ పాఠశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చాలామంది స్వచ్ఛంద సంస్థ సభ్యులు రక్తదానం చేశారు. ఇందులో 12వ సారి రక్తదానం చేసిన మొగిలిచర్ల రాముకు నిర్వాహకులు ప్రశంసాపత్రం అందించి అభినందించారు. ఏఎస్ఆర్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు ఎర్రబోయిన రాజశేఖర్, స్వయం కృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ పాల్గొన్నారు.



కరీమాబాద్: ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు


చెన్నారావుపేట: ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

# ఎయిడ్స్‌పై అవగాహన పెంచాలి

### డీఎంహెచ్‌వో వెంకటరమణ

### జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు

వరంగల్ చౌరస్తా , డిసెంబర్ 1: ప్రతి ఒక్కరూ మౌనం వీడి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సహకారంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేపడుతున్న చర్యలతో జిల్లాలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గుతూ వస్తున్నదని తెలిపారు. వ్యాధిగ్రస్తుల తగ్గుదలలో వేగం పెంచడంతోపాటు ఎయిడ్స్, హెచ్ఐవీ వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఐసీటీసీల ద్వారా ఏడాదిగా 25,595 మందికి నిర్వహించిన పరీక్షల్లో 389(1.5శాతం), 31వేల 355 మంది గర్భిణులకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో 14 మంది హెచ్ఐవీ బారిన పడ్డారని గుర్తించినట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు నిర్వహించిన 21వేల 250 వైద్య పరీక్షల్లో 310 మందిని గుర్తించినట్లు పేర్కొన్నారు. సంపూర్ణ సురక్ష హెచ్ఐవీ, ఎయిడ్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాలోనూ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. 1097 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2వేల 224మందికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందన్నారు. ఏఆర్‌టీ పెన్షన్ పథకం ద్వారా ప్రతి నెల 845 మందికి రూ.2,016 పెన్షన్ ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నెల సుమారు 45 కొత్త కేసులు నమోదవుతున్నాయని వెల్లడించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు స్వచ్ఛంద సంస్థలతో కలిసి అధికారులు విస్తృతంగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో వ్యాధి నివారణ చర్యలకు కృషి చేస్తామని జిల్లా వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సుధార్‌సింగ్, డాక్టర్ ప్రకాశ్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సూర్యప్రకాశ్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, మెడికల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ డాక్టర్ భిక్షపతి పాల్గొన్నారు.



వరంగల్ చౌరస్తా: మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

### రంగశాయిపేటలో..

కరీమాబాద్: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని రంగశాయిపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభాదేవి అన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా రంగశాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలన్నారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

### 'బిట్స్' విద్యార్థుల ర్యాలీ

నర్సంపేట రూరల్: మండలంలోని లక్నెపల్లి శివారు బాలాజీ ఇంజినీరింగ్ కళాశాల (బిట్స్) విద్యార్థులు ప్లకార్డులతో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు ఎయిడ్స్ ఆకారంలో కూర్చొని ప్రదర్శించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిట్స్ చైర్మన్ డాక్టర్ అండ్ర రాజేంద్రప్రసాద్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ హరిహరన్, ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడారు. బిట్స్ సెక్రటరీ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, ఏవో సలేంద్ర సురేశ్ ఉన్నారు. మండలంలోని భాంజీపేటలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

### అవగాహన ర్యాలీలు

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యాధికారి సరోజ ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. పాపయ్యపేట గుడ్ షెఫర్డ్ పాఠశాల విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు రవీందర్, రాంబాబు, శంకర్, అనిల్, మోహన్‌లాల్, వైద్య సిబ్బంది సీహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, సూపర్‌వైజర్ రామెల్, శివాజి, స్వరూపారాణి, వెంకట్‌రెడ్డి, సారియా, కవిత పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

## రేపు గురుధామంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

పోచమ్మమైదాన్, డిసెంబర్ 1: ములుగు రోడ్డులోని సప్తధామం (గురుధామం)లో ఈనెల 3న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించనున్నట్లు శివానంద కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఆదివారం ఉదయం 8గంటల నుంచి శ్రీ మహా గణపతి హోమం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే భక్తులకు పూజా ద్రవ్యాలైన ద్రవ్యాలు ఆవు, నెయ్యి, ఆవుపాలు, ఆవు పెరుగు, ఇతరాలను ఉచితంగా సమకూర్చడంతోపాటు అందరికీ భోజనసదుపాయం కల్పిస్తామని వివరించారు. గురుదేవులు శ్రీ శివానందమూర్తి దివ్య ఆశీస్సులతో జరిగే సామూహిక వ్రతంలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి దాదాపు వేయి మంది శివానందమూర్తి భక్తులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్తీకమాసంలో ఇలాంటి సత్యనారాయణస్వామి వ్రతాన్ని సమష్టిగా చేసుకునే అవకాశం అరుదుగా ఉంటుందని, భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రస్టీలు బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, రేపాల రాంచందర్ పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో మహా అన్నదానం


అయ్యప్ప ఆలయంలో అన్నదానం చేస్తున్న భక్తులు

నర్సంపేట, డిసెంబర్ 1: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో మహాఅన్నదానం చేశారు. ఆలయంలో 16వ రోజు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అన్నదాతలు స్వామివారికి తేనె అష్టాభిషేకం, ధనాభిషేకం చేశారు. అన్నదాతలు బండారుపల్లి చెంచారావు–కళ్యాణి, నరేష్–భవ్య, కేరళ వాస్తవ్యులు తక్కలపల్లి సత్యనారాయణ–జయలక్ష్మి, తుమ్మ రమేశ్–రజిత దంపతులు, సాయికిరణ్, బ్రాహ్మనపల్లి సుధాకర్ రమాదేవి, సుహాన్ సునితా, రాజు శ్రీలత, ప్రవీణ్‌కుమార్ సాగరిక, పడిగల రమేశ్ వాణి పాల్గొన్నారు.


భిక్ష చేస్తున్న అయ్యప్ప స్వాములు